దానం గెలుపునకు కృషి చేస్తాం

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

రాంనగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపునకు కృషి చేస్తామని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. బుధవారం గోల్కొండ చౌరస్తాలో సీపీఎం నగర కార్యాలయంలో దానం నాగేందర్‌కు మద్దతుగా సంఘీభావ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీవీ రాఘవులు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చడంతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్లు తొలగించే ప్రమాదం ఉన్నందున దేశంలోని అన్ని వర్గాల ప్రజలు నియంత మోదీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో సెక్యూలర్ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సీపీఎం తనవంతు పాత్ర పోషిస్తుందని, అందులో భాగంగానే దానం నాగేందర్‌కు మద్దతు తెలుపుతుందని చెప్పారు. ప్రధాని మోదీ తన స్థాయికి తగ్గట్లుగా వ్యవహరించడం లేదని, మంగళ సూత్రాలు లాక్కొని ముస్లింలకు పంచిపెడతారని ఆరోపించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. దశాబ్దాల పాటు కాంగ్రెస్ పాలించిందని, ఎంత మంది మహిళల మంగళ సూత్రాలు ఇప్పటివరకు లాగేసుకున్నారో మోదీ చెప్పాలన్నారు. దానం శక్తి సామర్థ్యాలు గల నాయకుడని, ప్రజలకు అందుబాటులో ఉండే నేతని అలాంటి వ్యక్తిని పార్లమెంట్‌కు పంపించాల్సిన అవసరం ఉందన్నారు. దానం నాగేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు సీపీఎం మద్దతు ప్రకటించడం శుభపరిణామన్నారు. సీపీఎం ఎన్నో సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజల హక్కులను కాపాడుతోందని కొనియాడారు. సీపీఎం తనకు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించడంతో తన విజయం ఖాయమైందన్నారు.


అభివాదంచేస్తున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, కాంగ్రెస్ సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్, సీపీఎం, కాంగ్రెస్ నేతలు


ఎన్నికల ప్రచారంలో భాగంగా తుకారాంగేట్‌లో ఆటో నడుపుతున్న దానం నాగేందర్

దానం గెలుపునకు అంకితభావంతో పనిచేయండి

సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దానం నాగేందర్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ సి. రోహిణిరెడ్డి సూచించారు. బుధవారం బాగ్‌అంబర్‌పేటలో మాజీ ఎంపీ హనుమంతరావు నివాసంలో నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు, బ్లాక్, డివిజన్ అధ్యక్షులతో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రోహిణిరెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేసేలా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు.

దానంకు మాల ప్రజా సంఘాల జేఏసీ మద్దతు

దానం నాగేందర్‌కు మాల ప్రజా సంఘాల జేఏసీ మద్దతు ఇస్తున్నట్లు జేఏసీ చైర్మన్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య తెలిపారు. బుధవారం అడిక్‌మెట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని రక్షించాలన్నా, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కొనసాగాలంటే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. మాలలు, దళిత బహుజనులందరూ దానంను గెలిపించాలని జేఏసీ ప్రచారం చేస్తుందని తెలిపారు.

గాంధీనగర్‌లో 15 వేల ఓట్ల మెజారిటీ సాధిస్తాం

చిక్కడపల్లి: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు గాంధీనగర్ డివిజన్‌లో 15 వేల ఓట్ల మెజారిటీ సాధిస్తామని డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ అన్నారు. బుధవారం సాయంత్రం డివిజన్‌లోని 46 బూత్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దానంను గెలిపించాలని కోరుతూ గురువారం నుంచి డివిజన్‌లో పాదయాత్రలు నిర్వహిస్తామని తెలిపారు.

దానంను గెలిపించండి : విజయారెడ్డి

ఖైరతాబాద్: దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరుతూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి ఖైరతాబాద్‌లో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సచ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.


ఖైరతాబాద్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి


గోల్నాక కృష్ణానగర్‌లో ప్రచారం చేస్తూ వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డి

అంబర్‌పేట ప్రజల అండతో ఎంపీగా విజయం సాధిస్తా

బీజేపీ సికింద్రాబాద్ అభ్యర్థి కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర/గోల్నాక, మే 1 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గ ప్రజల అండతో మరోసారి ఎంపీగా విజయం సాధిస్తానని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని ఆయన స్పష్టం చేశారు. బుధవారం బర్కత్‌పుర అంజయ్యపార్కులో సమావేశం, గోల్నాక డివిజన్‌లోని శాస్త్రినగర్, అడ్డీకార్ఖానా, నెహ్రూనగర్, సుందర్‌నగర్, కృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో ఈ నియోజకవర్గం ప్రజలు భారీ మెజారిటీ అందించారని, ప్రస్తుత ఎన్నికల్లో కూడా మెజారిటీ అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అంబర్‌పేట నియోజకవర్గం ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించానని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ఆ రెండు పార్టీలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అపార్ట్‌మెంట్, కాలనీవాసులు ఓటింగ్ శాతం పెరగడానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీమంత్రి సి. కృష్ణాయాదవ్, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్, నాయకులు కన్నె రమేష్‌యాదవ్, జి. ఆనంద్‌గౌడ్, ఎ. సూర్యప్రకాష్‌సింగ్, చిట్టి శ్రీధర్, నందకిషోర్‌యాదవ్, ఎక్కాల కన్నా, వనం రమేష్, కేసరి నర్సింగ్‌రావు యాదవ్, మోత్కుల శ్యామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు : లక్ష్మణ్

సామాజిక అసమానతలు తొలగే వరకూ.. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కొనసాగింపు

రాంనగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు రద్దుచేస్తామని, రాజ్యాంగాన్ని మారుస్తామని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ కోరారు. పదేళ్లలో కేంద్రంలో బీజేపీ పాలనను చూసి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న జి. కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం అడిక్‌మెట్ డివిజన్‌లో నాగమయ్యకుంట, సాయిచరణ్ కాలనీ, దయానంద్‌నగర్, అచ్యుత్‌రెడ్డి మార్గ్, ఆజామాబాద్ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి కమలం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సామాజిక అసమానతలు తొలగే వరకు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను మోదీ ప్రభుత్వం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మతపరమైన ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేసి వాటిని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇస్తామని తెలిపారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే అది మురిగిపోతుందన్నారు. ప్రచారంలో ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రాం, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు ఆర్. నరేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి. సూర్యనారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు.


సాయిచరణ్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ కె. లక్ష్మణ్

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

రాంనగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నాయకుడు నైషదం సత్యనారాయణమూర్తి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపునకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● బీఆర్ఎస్ గ్రేటర్ నాయకుడు అమరం వినోద్ తన అనుచరులతో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వినోద్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో గుర్తింపు లేకపోవడంవల్ల కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపునకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్, మాజీ కార్పొరేటర్ ఆర్. కల్పనాయాదవ్, పాశం అనిల్‌కుమార్, అమ్జద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


సత్యనారాయణ మూర్తికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న మంత్రి శ్రీధర్‌బాబు


అంజన్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన అమరం వినోద్ తదితరులు


నిరసన తెలుపుతున్న ఐఎన్‌టీయూసీ కార్మిక నేతలు

కార్మికులకు షిఫ్టింగ్ బెనిఫిట్స్ ఇవ్వకుండా
వీఎస్టీని తూప్రాన్‌కు తరలించడం అన్యాయం

రాంనగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాల ప్రకారం కార్మికులకు షిఫ్టింగ్ బెనిఫిట్స్, ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా వీఎస్టీ కంపెనీని తూప్రాన్‌కు తరలించడం అన్యాయమని ఐఎన్‌టీయూసీ విభాగం నాయకులు, కార్యకర్తలు ఆరోపించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో యూనియన్ కార్యాలయంలో జరిగిన మేడే వేడుకల్లో వీఎస్టీ వర్కర్స్ యూనియన్ ఐఎన్‌టీయూసీ విభాగం నాయకులు, కార్యకర్తలు యాజమాన్యానికి, యూనియన్ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ విభాగం నాయకులు కె. రాజు, ఎల్‌డీ పాల్, శ్రీనివాస్‌యాదవ్, సమద్, ప్రభాకర్, సాయిప్రసాద్‌రెడ్డి, జానకిరామ్ మాట్లాడుతూ. 2017లో వీఎస్టీకి చెందిన పీఎండీ విభాగాన్ని తూప్రాన్‌కు తరలించిన సందర్భంగా ప్రతి కార్మికుడికి నెలకు నాలుగువేల రూపాయల షిఫ్టింగ్ బెనిఫిట్స్, నాలుగు ఇంక్రిమెంట్లు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం కంపెనీని తూప్రాన్‌కు తరలిస్తున్న నేపథ్యంలో కార్మికులకు క్యాష్ బెనిఫిట్స్, ఇంక్రిమెంట్లు ఎందుకు ఇవ్వడం లేదని వారు ప్రశ్నించారు. నగరం నుంచి తూప్రాన్‌కు వెళ్లి రావాలంటే నాలుగు గంటలు సమయం పడుతుందని, కార్మికులు వెళ్లి రావడానికి బస్సు సౌకర్యం కల్పించడం లేదని వాపోయారు. తమ సమస్యలను యాజమాన్యం, యూనియన్ నేతలు పట్టించుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

కాంగ్రెస్‌వి ఆచరణ సాధ్యం కాని హామీలు

రెజిమెంటల్‌బజార్, మే 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌వి ఆచరణ సాధ్యం కాని హామీలని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం మోండా డివిజన్ సజ్జన్‌లాల్ స్ట్రీట్, పాట్ మార్కెట్, ఆదయ్యనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజులలో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి 5 నెలలు అయినా అమలు చేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ తరఫున పోటీ చేసే అభ్యర్థులు లేక బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి టికెట్‌లు ఇచ్చిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. పద్మారావు అంటే ఒక బ్రాండ్ అని, ఆయన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు హైలాబ్ యాదవ్, ధర్మేందర్ యాదవ్, రామేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మహిళను ఓటు అభ్యర్థిస్తున్న పద్మారావుగౌడ్

పద్మారావుగౌడ్ మచ్చలేని నాయకుడు

ముషీరాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు మద్దతుగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ బుధవారం బాకారం, బ్యాంక్ ఆఫ్ బరోడా కాలనీ, మహాత్మానగర్, దేవిచౌక్ వీధుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పద్మారావు మచ్చలేని నాయకుడని, కారు గుర్తుకు ఓటేసి ఆయనను గెలిపించాలని కోరారు. ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పద్మారావు గెలుపు ఖాయం

నల్లకుంట: అంబర్‌పేట నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులను చూసి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పద్మారావుగౌడ్ విజయం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బుధవారం నల్లకుంట డివిజన్ సత్యానగర్, రత్నానగర్ తదితర బస్తీల్లో పద్మారావుగౌడ్‌కు మద్దతుగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, సీనియర్ నాయకులు ఎం. భూపతి నాథ్, మూర్తి, నవీన్, బి. రాంచందర్, రవీందర్, భాస్కర్, ఇర్ఫానా సుల్తానా, స్వప్న పాల్గొన్నారు.

సత్యేంద్రనాథ్‌కు లయ వాయిద్య ప్రవీణ బిరుదు ప్రదానం

చిక్కడపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): సుప్రసిరి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం త్యాగరాయగానసభలో జరిగిన కార్యక్రమంలో వాయిద్య కళాకారుడు సత్యేంద్రనాథ్‌కు లయ వాయిద్య ప్రవీణ బిరుదు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో సాహితీవేత్త ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ.. కళాకారులను సత్కరించుకోవడం సమాజం బాధ్యత అన్నారు. కళాకారులు ఎప్పుడూ సమాజ సంక్షేమానికి కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో లంక లక్ష్మీనారాయణ, కలగా కృష్ణమోహన్, నిర్మల, లావణ్య, శోభ, ఉషామోహన్ రాజ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు


సత్యేంద్రనాథ్‌కు లయ వాయిద్యప్రవీణ బిరుదును ప్రదానం చేస్తున్న ఓలేటి పార్వతీశం


గాంధీనగర్‌లో చీరలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు శ్రీశైలం యాదవ్


అంబర్‌పేటలో శానిటేషన్ సిబ్బందిని సత్కరించిన డీఎంసీ మారుతీ దివాకర్, ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత

ఘనంగా మే డే వేడుకలు

ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో బుధవారం మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాలను ఆవిష్కరించి జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు.


రాంనగర్ మీ సేవ వద్ద మే డే జెండాను ఆవిష్కరిస్తున్న హెచ్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి రామారావు


ముషీరాబాద్‌లో మే డే జెండాను ఆవిష్కరించిన ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. అంజిరెడ్డి


వీఎస్టీ కార్మికులకు అవార్డులు ప్రదానం చేసిన వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బలి ప్రభాకర్


గోల్నాక డివిజన్ గంగానగర్‌లో జరిగిన మే డే వేడుకల్లో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బి.వెంకటేశం తదితరులు


ఫీవర్ ఆస్పత్రిలో మే డే జెండాను ఆవిష్కరించిన టీఎంహెచ్ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్

పారిశుధ్య కార్మికుల శ్రమ గొప్పది

నల్లకుంట, మే 1 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికుల శ్రమ గొప్పదని ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత అన్నారు. బుధవారం నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శంకరమఠం కూరగాయల మార్కెట్‌లో మే డే సందర్భంగా 15 మంది పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి మోహన్ నాయుడు, నాయకులు శ్రీనివాస్‌రావు, హర్ష, సత్యనారాయణ, కృష్ణబాబు, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక ఐక్య ఉద్యమాలను ఉధృతం చేద్దాం

చిక్కడపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక ఐక్య ఉద్యమాలను ఉధృతం చేద్దామని అఖిలభారత వ్యవసాయ కార్మికసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ అన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ఆయా సంఘాల రాష్ట్ర కార్యాలయాల్లో మేడే సందర్భంగా బుధవారం పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ కనీసమద్దతు ధరల చట్టాన్ని తీసుకొస్తానని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. కనీస వేతనాలు పెరగకపోవడం వల్ల ప్రజల జీవనప్రమాణాలు పడిపోయాయన్నారు. కార్పొరేట్ అనుకూల మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు మేడే స్ఫూర్తితో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఇంట్లో చోరీ చేసిన నిందితుడి అరెస్ట్

కవాడిగూడ, మే 1 (ఆంధ్రజ్యోతి): దోమలగూడలో ఓ ఇంట్లో చోరీ చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి నగలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. న్యూబోయినపల్లి ఐడీహెచ్ కాలనీకి చెందిన అంబి ఆరోక్యరాజ్(43) హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. దోమలగూడలో ఓ ఇంట్లో గతనెల 29వ తేదీ అర్ధరాత్రి చోరీ చేశాడు.

బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు దోమల్‌గూడలో ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ గ్రౌండ్‌లో పాతభవనంలో నిద్రిస్తున్న నిందితుడు తంబి ఆరోక్యరాజ్‌ను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ. 93 వేలు, తులం బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నారు.

అగ్నిప్రమాదాలపై మాక్‌డ్రిల్

రాంనగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల నివారణపై విద్యానగర్‌లోగల నైన్ ఎడ్యుకేషన్ అకాడమీలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక శాఖ ఈవీడీఎం చరణ్ అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. తరగతి గదుల్లో, భవన సముదాయంలో అగ్నిప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ కంట్రోల్‌కు ఫోన్ చేయాలని, అగ్నిమాపక వాహనం వచ్చేలోపు మంటలను అదుపు చేసే చర్యలు చేపట్టాలని సూచించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, మే 1 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. డబీర్‌పుర-మలక్‌పేట రైల్వే స్టేషన్ల మధ్య 40 సంవత్సరాల వయస్సుగల గుర్తుతెలియని వ్యక్తి పట్టాలవెంట నడుచుకుంటూ వెళ్తున్నాడు. వేగంగా వస్తున్న రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

'కల్లు దుకాణాలపై దాడులను నిలిపివేయాలి'

రాంనగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో కల్లు దుకాణాలపై ఎక్సైజ్ శాఖ అధికారుల అక్రమ దాడులను నిలిపివేయాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్సైజ్ శాఖ అధికారుల అక్రమ దాడులు, అరెస్ట్‌ల వల్ల కల్లు గీత సొసైటీదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.